
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

శ్రీకాకుళం

జిల్లా వార్తలు

ఆదివారం 5 అక్టోబరు 2025



రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు
- పాత తుంగతంపరలో కోతకు గురైన వరదగట్టు పరిశీలన
- పంట నష్టం నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం
- కొత్తూరు నుంచి కళింగపట్నం వరకు వరదకట్టల నిర్మాణానికి చర్యలు

8లో

ఆటోడ్రైవర్ల సేవలో

- జిల్లాలో 13,887 మందికి రూ.20.83కోట్ల లబ్ధి
- మీ కష్టానికి, గౌరవానికి ఇది ఒక గుర్తింపు
- అన్నివిధాలా అండగా ఉంటాం
- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

అరసవల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి)

'మీ కష్టానికి, గౌరవానికి ఇది ఒక గుర్తింపు. రోగులను ఆస్పత్రికి తీసుకెళ్లాలన్నా.. విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాలన్నా, ఏ సమయంలోనైనా గుమ్మం వద్దకే చేర్చే మీ సేవలు అపురూపం. అటువంటి మీకు కూటమి ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుంది' అని కేంద్ర పౌరవిమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు భరోసా ఇచ్చారు. శనివారం శ్రీకాకుళంలో 'ఆటోడ్రైవర్ల సేవలో' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. బలగ ప్రాంతం నుంచి ఆయన ఆటోడ్రైవర్ యూనిఫాం వేసుకుని, స్వయంగా ఆటో నడిపారు. ఏడురోడ్లజంక్షన్ వరకూ ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఎన్టీఆర్, కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



శ్రీకాకుళంలో ఆటోల ర్యాలీ



ర్యాలీలో ఆటో నడుపుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, పక్కన ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాస్

అనంతరం మునిసిపల్ పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'ఆటోడ్రైవర్ల సేవలో' కార్యక్రమం ఎంతో సంతృప్తినిస్తోంది. ఎన్నికల హామీమేరకు మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించాం. దీనివల్ల మీ ఇబ్బందులను గుర్తించి.. ప్రభుత్వం 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద అర్హులైన ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున అందజేస్తోంది. గత ప్రభుత్వం రూ.10 వేలు చొప్పున ఇచ్చినా.. ట్యాక్స్‌లు, చలానాల పేరిట మోసగించి డబ్బులు లాగేసుకుంది. గతుకుల రోడ్లతో మీ ఆరోగ్యాలను పాడు చేసింది. మా కూటమి ప్రభుత్వం రోడ్లను బాగు చేసింది. 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకం కింద గత ప్రభుత్వం కన్నా అదనంగా మరో 5వేలు అందజేస్తున్నాం. నేరుగా ఆటోడ్రైవర్ల బ్యాంకు ఖాతాలో నిధులు జమ చేశాం. జిల్లాలో 13,887 మంది ఆటోడ్రైవర్లకు రూ.20.83కోట్ల లబ్ధి చేకూరుతోంది. ఇంకా అర్హులెవరికైనా ఈ పథకం వర్తించకపోతే 'మీ-కోసం(గ్రీవెన్స్)'లో ఫిర్యాదు చేయండి. అధికారులు పరిశీలించి అర్హులకు పథకం వర్తింపజేస్తార'ని కేంద్రమంత్రి తెలిపారు. జీఎస్టీ 2.0తో ధరలు తగ్గాయని, ఎలక్ట్రిక్ ఆటోల వినియోగానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆటోడ్రైవర్ల కోసం పట్టణంలో ఒక భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఖాకీ యూనిఫాం ధరించానని.. ఇద్దరు కన్నా ఎక్కువ ధైర్యంగా అనిపిస్తోందన్నారు. కుటుంబ సభ్యుడిలా ఆటోడ్రైవర్ల కష్టసుఖాల్లో అండగా ఉంటామని స్పష్టం చేశారు.

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'ఈ పథకం ఆటోడ్రైవర్ల అందరి కోసం. మీ బాగు కోసం ప్రభుత్వం పనిచేస్తోంది. స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మీకు ఎదురయ్యే (మిగతా 8వ పేజీలో..)

మా కష్టాలు తెలిసిన నాయకుడు



'మా కష్టాలు తెలిసిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు' అని బలగలోని శ్రీ భవానీ ఆటోడ్రైవర్ల సంక్షేమం సంఘం సభ్యులు చుక్క అప్పన్న, కరగాన సోమేశ్, చమళ్ల తిరుపతిరావు, లోకేశ్, నర్సింహమూర్తి ఆనందం వ్యక్తం చేశారు. స్త్రీశక్తి పథకంతో తామంతా ఇబ్బందులు పడుతున్నామని గుర్తించి.. అండగా నిలిచినందుకు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

చంద్రబాబుకు రుణపడి ఉన్నాం



నేను గత 25 ఏళ్లుగా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. మహిళలకు ఉచిత బస్సు పథకంతో మేం ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయాన్ని గుర్తించి, వెంటనే స్పందించింది కూటమి ప్రభుత్వం. ఇంత సత్వరంగా ఒక ప్రభుత్వం స్పందించి మాకు రూ.15వేలు ఆర్థిక సహాయం అందించడం నిజంగా గొప్ప విషయం. ముఖ్యమంత్రి చంద్రబాబుకు మేమంతా రుణపడి ఉన్నాం.

-ఎం.రాజారావు, ఆటోడ్రైవర్, మంగువారితోట

అర్ధరాత్రి హైవేపై ప్రమాదం

- లారీ కేబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్
- సురక్షితంగా బయటకు తీసిన అంబులెన్స్ సిబ్బంది

8లో

దసరా సెలవులకు వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- పొన్నాడ బ్రిడ్జి రోడ్డులో ఘటన



శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో రావణుడి దిష్టిబొమ్మ దహనం

7లో

వైభవంగా రావణ దహనం



పెంట గ్రామంలో అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

7లో

దుర్గాదేవికి సారె

- వైభవంగా అమ్మవారి విగ్రహ నిమజ్జనం

జీఎస్టీ తగ్గినా.. అవే రేట్లు



- వినియోగదారులను మోసగిస్తున్న వ్యాపారులు
- పాత ధరలతోనే వస్తువుల విక్రయాలు
- పూర్తిస్థాయిలో అమలుకాని కొత్త విధానం
- ఇంకా సామాన్యుల్లో కానరాని అవగాహన
- పోస్టర్ల ఆవిష్కరణకే అధికారులు పరిమితం



శ్రీకాకుళం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి)

సామాన్యులకు ఊరటనిచ్చేలా కేంద్ర ప్రభుత్వం చాలా వస్తువులపై, నిత్యావసర సరుకులపై జీఎస్టీని తగ్గించినా.. వ్యాపారులు మాత్రం దోపిడీ ఆపడం లేదు. చాలామంది వినియోగదారులకు జీఎస్టీ తగ్గిన విషయం పెద్దగా తెలియకపోవడంతో పాత ధరకే వస్తువులను విక్రయిస్తున్నారు.



వినియోగదారులపై భారం మోపుతూ మోసగిస్తున్నారు. జీఎస్టీ 2.0 విధానం అమల్లోకి వచ్చి పది రోజులు పైబడింది. గత నెల 22 నుంచి సుమారు 83 కేటగిరిలకు సంబంధించిన వస్తువులు, సేవలు, మందులపై కేంద్రం జీఎస్టీ శ్లాబ్ తగ్గించింది. గతంలో నాలుగు శ్లాబ్‌లు ఉంటే.. ప్రస్తుతం రెండు శ్లాబ్‌లకే పరిమితం చేసింది. కానీ ఎక్కడా ఇవి పూర్తిస్థాయిలో అమల్లోకి రావడంలేదు. వ్యాపారులు అసలు ధర చెప్పడం లేదు. పాత సరుకు ఉందనే కారణంతో పాత ధరలే వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాత సరుకు ఎంత ఉందో చెప్పే వారెవరూ కనిపించడంలేదు. తగ్గిన జీఎస్టీ శ్లాబ్ వల్ల ప్రజలకు ఎప్పటికి ప్రయోజనం లభిస్తుందనేదానిపై స్పష్టత లేదు. అధికారులు మాత్రం జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామంటూ ప్రకటనలకే పరిమితమవుతున్నారు. కానీ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వ్యాపారుల మాత్రం చర్యలు తీసుకోవడం లేదు.

ఆఫర్లు అంటూ ప్రకటనలు..

టీవీలు, ఏసీలు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, కార్లు, మోటారు సైకిళ్లపై కొంతవరకూ ధర తగ్గినట్లు చెబుతున్నారు. కార్లపై రూ.50వేల నుంచి రూ.లక్ష వరకూ తగ్గగా, మోటారు సైకిళ్లపై రూ.15 వేల వరకూ తగ్గింది. టీవీలపై రూ.3వేల నుంచి రూ.4వేల వరకూ తగ్గిస్తున్నారు. కానీ ఇవన్నీ దసరా ఆఫర్లతో కలిపి అమ్ముతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. సిమెంట్ ధరలు తగ్గించడం లేదు. పాల ఉత్పత్తుల వద్ద ధరల పట్టీ పెట్టారు. కానీ పాత సరుకు ఉందని చెప్పడం గమనార్హం.



ధర తగ్గించాల్సి ఉన్నా..

- ప్రభుత్వ జీఎస్టీ శ్లాబ్‌ను తగ్గించిన 83 కేటగిరీల వస్తువులు, సేవలు వంటి వాటి వివరాలు ప్రకటించింది. వీటి ధరలు కచ్చితంగా తగ్గించాల్సిందే.
- పన్నీరు, టెట్రాప్యాక్ పాలు, చపాతీలు, రోటీలపై గతంలో ఐదు శాతం జీఎస్టీ ఉండేది. దానిని పూర్తిగా ఎత్తేశారు. దీంతో ఆయా వస్తువుల ధరలు తగ్గాల్సి ఉన్నా.. పాత రేటుకే వ్యాపారులు విక్రయిస్తున్నారు.
- వెన్న, నెయ్యి, తృణధాన్యాలు, చక్కెర, కాఫీ, సూప్‌లు, బేకింగ్ పౌడర్, నిల్వ ఉంచి చేప, మాంసం రేట్లపై జీఎస్టీ గతంలో 12 శాతం ఉండేది. ప్రస్తుతం కేవలం 5 శాతం వసూలు చేయాలి. 20 లీటర్ల తాగునీటి డబ్బాలు, కొబ్బరిపాలు, బాదం, జీడిపప్పు పాలు, అవిసెపాలు, బియ్యంపాలు, ఓటు పాలు, పండ్ల గుజ్జు, రసాలు, పాలు ఆధారిత పానీయాలపై (మిగతా 7వ పేజీలో..)

వరదనీటిలో నిలిచిన ఆర్టీసీ బస్సు

పొందూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వర్షం పడితే రైల్వే అండర్‌పాసేజ్ మీదుగా ప్రయాణించే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. శనివారం పొందూరు మండలం బొడ్డేపల్లి సమీపంలోని అండర్‌పాసేజీ వద్ద 8 అడుగుల మేర వరదనీటిలో ఆర్టీసీ బస్సు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. బస్సును ఎక్స్‌కవేటర్ సాయంతో వరదనీటి నుంచి బయటకు తీశారు. బ్రిడ్జిలో వరద నీరు నిలిచిపోవడంతో ఇరువైపులా పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎప్పటికప్పుడు వరదనీటి కారణంగా ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు ప్రత్యామ్నాయం చూపాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.




బొడ్డేపల్లిలోని అండర్‌పాసేజీ వద్ద వరదనీటిలో చిక్కుకున్న బస్సును బయటకు తీస్తున్న దృశ్యం

నాగావళి నదిలో రైతు గల్లంతు

ఆమదాలవలస, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస మండలం కనుగులవలస గ్రామానికి చెందిన కొక్కిరాల నారాయుడు అనే రైతు నాగావళి నదిలో దిగి గల్లంతయ్యారు. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు, సర్పంచ్ నూక రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 'దూసి గ్రామంలో ఉన్న పొలంలో యూరియా జల్లేందుకు నారాయుడు శుక్రవారం వెళ్లాడు. సాయంత్రం తిరిగొస్తూ నాగావళి నదిలో కాళ్లు, చేతులు కడుక్కోవడానికి దిగి జారిపోయాడు. ఆ సమయంలో నీరు ఉధృతంగా ప్రవహించడంతో నదిలో కొట్టుకుపోయాడు. కాపాడండి అంటూ కేకలు వేయగా.. సమీప పొలంలో ఉన్నవారు అక్కడకు వెళ్లినా ఆచూకీ కనిపించలేదు. ఈ విషయం తెలిసి కుటుంబ సభ్యులు విలపించారు. దీనిపై పోలీసులకు, అధికారులకు ఫిర్యాదు. ఈ మేరకు శనివారం ఉదయం నాగావళి నదిలో నారాయుడు ఆచూకీ కోసం గాలించారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో భార్య సుభద్ర, కుమారుడు నాగరాజు, ఇద్దరు కుమార్తెలు కన్నీరుమున్నీరయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆమదాలవలస ఎస్ఐ బాలరాజు తెలిపారు.



నాగావళి నదిలో నారాయుడు ఆచూకీ కోసం గాలింపు



నారాయుడు (ఫైల్)

ఇంకా ముంపులోనే వరిపంట

నరసన్నపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి తుంపర భూముల్లో వరదనీరు చేరింది. దీంతో నరసన్నపేట మండలంలో చిక్కాలవలస, మామిడివలస గ్రామాల్లో సుమారు 230 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. వర్షం తెరిపిచ్చినా.. ఇంకా పంట ముంపులోనే ఉంది. వరిపైరు పొట్ట దశలో నీట మునగడంతో పంట కుళ్లిపోయే ప్రమాదం ఉందని ఆయా ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కంబకాయి, బసివలస గ్రామాల్లో తుంపర ప్రాంతాలకు వరదనీరు చేరడంతో నూకాలమ్మకాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. చిక్కావలస ప్రాంతంలో నీటి మునిగిన పంట పొలాలను ఏవో సూర్యకుమారి, వీఏఏ బి.పద్మజ, వీఆర్వో చక్రధర్ పరిశీలించారు.



చిక్కాలవలసలో నీట మునిగిన వరిపంటను చూపిస్తున్న రైతులు

జీఎస్టీ తగ్గినా.. అవే రేట్లు

(ఐదో పేజీ తరువాయి)

గతంలో 18 శాతం జీఎస్టీ వసూలు చేసేవారు. ఈ శ్లాబ్‌ను 5కి పరిమితం చేశారు. ● సబ్బులు, హెయిర్ ఆయిల్, షాంపూలు, దువ్వెనలు, పౌడర్లపై జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గింది. ఫేస్‌పౌడర్, షేవింగ్ క్రీమ్, ఆఫ్టర్ షేవ్ లోషన్లపై 18శాతం ఉండే జీఎస్టీని 5 శాతానికి పరిమితం చేశారు.

● విద్యార్థులు ఉపయోగించే ఎరేజర్లు, పుస్తకాలు, పెన్సిళ్లపై జీఎస్టీని ఎత్తేశారు. జామెట్రీ, రంగు పెట్టెలు, పేపరు కార్టూన్లు తదితర వస్తువులపై 12శాతం ఉండే జీఎస్టీని 5 శాతానికి తగ్గించారు.

● అరుదైన వ్యాధులకు సంబంధించిన మందులపై పూర్తిగా జీఎస్టీ ఎత్తేశారు. యునాని, సిద్ధ, హోమియోపతి సహా అన్ని మందులు, ఆక్సిజన్ కిట్లు, రసాయనాలు, గ్లూకోమీటరు, సర్జికల్ వస్తువులపై 12 శాతం ఉంటే 5 శాతానికి పరిమితం చేశారు. థర్మామీటరుపై 18శాతం ఉండే జీఎస్టీని 5 శాతానికి తగ్గించారు.

● వ్యవసాయ పరికరాలు, యంత్రాలపై గతంలో 12 నుంచి 18 శాతం జీఎస్టీ ఉండేది. ప్రస్తుతం 5 శాతానికి తగ్గించేశారు.

● వాహ నాలపై గతంలో 28 శాతం జీఎస్టీ ఉంటే 18 శాతానికి పరిమితం చేశా రు. సైకిళ్లు, వాటి భాగాలపై 12 శాతం ఉంటే 5 శాతానికి తగ్గించారు.

● సిమెంట్‌పై జీఎస్టీ 28 శాతం ఉంటే 18 శాతానికి పరిమితం చేశారు. మిగిలిన గృహ నిర్మాణ వస్తు వులపై 12 శాతం ఉంటే 5శాతానికి కుదించారు. టీవీలు, ప్రొజెక్టర్లు, ఏసీలు, డిషల్ వాషర్లపై గతంలో 28 శాతం జీఎస్టీ ఉంటే దానిని 18 శాతానికి పరిమితం చేశారు. సోలార్ వాటర్ హీటర్, సిస్టమ్స్ సోలార్ కుక్కర్లపై 12 శాతం ఉంటే 5 శాతానికి తగ్గించారు. బొమ్మలు, క్రీడాపరి కరాలపై 5శాతమే జీఎస్టీ.

● ఫీడింగ్ బాటిళ్లు, స్టీల్, అల్యూమినియం, రాగి వంటి పాత్రలు, ఫీడింగ్ బాటిళ్లు, బేబీ న్యాప్ కిన్‌లు, డైపర్లు, కొవ్వొత్తులు, స్టీలు, అల్యూమినియం, రాగి, ఇత్తడి, వంటగది పాత్రలు, కుట్టు యంత్రాలు, రబ్బరు బ్యాండ్లపై 12 శాతం జీఎస్టీని 5శాతానికి తగ్గించారు. కాఫీ, చాక్లెట్లు, కేక్‌లు, బిస్కెట్లు, జామ్‌లపై గతంలో 18 శాతం జీఎస్టీ ఉండగా ఇప్పుడు 5 శాతానికి కుదించారు. ● బాదం, పిస్తా, ఖర్జూరం, అంజీరా తదితర డ్రైఫ్రూట్‌లు, పండ్ల రసాలపై 12 శాతం ఉన్న జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించారు. ● ఇలా చాలా వస్తువులపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించినా వ్యాపారులు ఇంకా పాత పన్ను విధానమే అనుసరి స్తున్నారు. వాస్తవా నికి సామాన్యుడికి ఇప్పటికీ ఎంత శాతం లాభం చేకూరింది. వ్యాపారులు ఏ మేరకు ధరలు తగ్గించారన్నదీ తెలియడం లేదు. దీనిపై అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సి ఉంది. అలాగే అధికా రులు సామాన్యుల వలె దుకాణాల్లో కొనుగోలు చేసి.. వాస్తవాలు పరిశీలిస్తేనే జీఎస్టీ 2.0 ఫ లాలు ప్రజలకు చేరువవుతాయని పలువురు అభిప్రాయపడు తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఇప్పిలి గ్రామానికి చెందిన ఇప్పిలి ఈశ్వరరావు (42) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ కె.రాము తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. శుక్రవారం మధ్యాహ్నం ఇప్పిలి ఈశ్వరరావు (42) మద్యం సేవించి ఇంటికి వెళ్లగా కుటుంబ సభ్యులతో వాగ్వాదం జరిగింది. దీనికి మనస్తాపం చెందిన ఈశ్వరరావు తాను సాగు చేస్తున్న పొలానికి వెళ్లి పురుగు మందు సేవించాడు. దీనిని గమనించిన స్థానికులు వెంటనే శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కుమార్తె దుర్గ ప్రణీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

దుర్గాదేవికి సారె

జి.సిగడాం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా పెంట గ్రామంలో శనివారం దుర్గాదేవి అమ్మవారికి గ్రామ మహిళలు 100 రకాల పిండివంటలు, మిఠాయిలతో సారె సమ ర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ వీధుల్లో అమ్మవారి విగ్రహాన్ని సాంస్కృతిక ప్రదర్శనలు, బాణ సంచా కాల్పుల మధ్య భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులోని కోనేరులో నిమజ్జనం చేశారు. కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

న్యాయసేవలు అందించేందుకు సహకరించండి



మాట్లాడుతున్న కె.హరిబాబు

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 4 (ఆంధ్ర జ్యోతి): జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ అందిస్తున్న న్యాయ సేవలు ప్రజలకు అందేలా అన్ని శాఖల అధి కారులు సహకరించాలని సంస్థ కార్యదర్శి కె.హరిబాబు కోరారు. శని వారం సంస్థ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఉచిత న్యాయసేవలు అందించడం లో అధికారులకు కీలక పాత్ర వహించాలన్నారు. పాతపట్నం న్యాయాధికారి ఎం.రోషిణి, న్యాయవాది ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా నీటిలోనే...


ఎల్ఎన్‌పేట: తురకపేట సమీపంలోని కడపలగెడ్డ వద్ద పొలాల్లో నిలిచిన నీరు

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మూడు రోజులుగా పంట పొలాలు నీటిలోనే ఉన్నాయి. అనేకచోట్ల వరిపైరు నేలకొరిగింది. రహదారులు దెబ్బతిన్నాయి. పంట నష్టపోయామని.. ప్రభు త్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా గార మండలంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి బాధితులకు భోజనాలు ఏర్పాటు చేశారు.

-ఆంధ్రజ్యోతి బృందం


పలాస రూరల్: కేదారిపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరహాలగెడ్డ


మందస: కమలాపురం వద్ద నీట మునిగిన పంట పొలాలు


గార రూరల్: పునరావాస కేంద్రంలో వంటలు


కొత్తూరు: నీటిలోనే అరటి పంట


ఆమదాలవలస: బూర్జ మండలం అల్లెనలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

జీఎస్టీ 2.0తో దేశంలో పెనుమార్పు

● కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు


మాట్లాడుతున్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

అరసవల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు జీఎస్టీ 2.0ను ప్రకటించారని, ఇది దేశంలో ఒక పెనుమార్పునకు శ్రీకారం చుట్టనుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శనివారం నగరంలో ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంగా ట్రాక్టర్‌ను నడిపారు. ర్యాలీ ఆర్ట్స్ కళాశాల వరకు సాగింది. కళాశాల మైదానం లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ.. దసరా, దీపావళి పండుగలతో పాటు దేశ ప్రజలకు ప్రధాని మోదీ జీఎస్టీ పండుగను తీసుకువచ్చారన్నారు. దేశం ప్రపంచంలోనే గొప్ప ఆర్థిక, సైనిక శక్తిగా ఎదుగుతోందని, ఇటువంటి సమయంలో మనం పూర్తిగా స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలన్నారు. ఆత్మనిర్భర భారత్ లక్ష్యం నెరవేర్చడమే జీఎస్టీ 2.0 ధ్యేయమన్నారు. జీఎస్టీ 2.0 అనంతరం గత పది రోజుల్లో జిల్లాలో 2,237 వాహనాల కొనుగోళ్లు జరిగాయని ఇది ఒక రికార్డు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెల రోజుల పాటు జీఎస్టీ ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో సాయి ప్రత్యూష, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా రావణ దహనం

● చెడుపై విజయమే: కేంద్రమంత్రి

అరసవల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో శనివారం రాత్రి రావణ దహన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది మంది ప్రజలు తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని కనులారా వీక్షించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. మన సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. చెడుపై విజయమే ఈ రావణదహన కార్యక్రమం అన్నారు. 50 అడుగుల ఎత్తైన రావణుని బొమ్మను తయారుచేసి బాణసంచా వెలుగుల మధ్య కేంద్రమంత్రి విల్లు ఎక్కుపెట్టి దహనం చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బాణసంచా వెలుగుల మధ్య రావణ దహనం

జిల్లా కేంద్రంలో మెడికల్ మాఫియా

అరసవల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కేంద్రం మెడికల్ మాఫియాకు అడ్డాగా తయారైందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్ అన్నారు. స్థానిక క్రాంతి భవన్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులు పుట్ట గొడుగులల్లా పుట్టుకొచ్చాయన్నారు. అనేక ఆసుపత్రుల్లో టెస్టులు, స్కానింగ్‌ల పేరుతో దోపిడీ చేస్తున్నా రని విమర్శించారు. ఆసుపత్రుల్లో సర్వీసులు, ధరల నోటీసు బోర్డులు ఏర్పాటు చేయకుండా మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలను ఉల్లంఘిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. చాలా ఆసుపత్రులు లైసెన్సులు లేకుండానే నడుస్తున్నాయని, అటువంటి వాటిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వై.రవి, జి.వసంతరావు, ఎం. జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ట్రాఫిక్ జామ్‌తో అవస్థలు

ఆమదాలవలస, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కేంద్రం నుంచి ఆమదాలవలస రైల్వే స్టేషన్ వరకు ఉన్న ప్రధాన రహదారిలో నిత్యం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఇటు కొత్తరోడ్డు, అటు దూసి జంక్షన్ వరకు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచి పోయాయి. దీంతో ప్రజలు, ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రహదారి పనులు కూటమి ప్రభుత్వంలో పూర్తయినప్పటికీ కొత్త రోడ్డు సమీపంలోని కల్వర్టు నిర్మాణం పూర్తికాకపోవడంతో నిత్యం ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయి. కల్వర్టు వద్ద ఇరుకుగా ఉండడంతో శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస, కొత్తూరు, పాతపట్నం, హిరమండలం, పాల కొండ, పార్వతీపురం ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఉదయం, సాయం సమయాల్లో నిలిచిపోతున్నాయి. దీంతో ప్రజలు పడుతున్న ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

అర్ధరాత్రి ఇంట్లో చొరబడి దౌర్జన్యం

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం మండలం రూరల్ బ్యాంకర్స్ కాలనీ శివ బాలాజీ దేవాలయం సమీపంలో కౌసల్య నిలయంలో శుక్రవారం అర్ధరాత్రి వేళ ఓ ముఠా చొరబడి దౌర్జన్యం చేసిన ఘటన కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గత కొన్నేళ్లుగా ఆ ఇంట్లో జామి విష్ణుమూర్తి కుటుంబంతో కలిసి అద్దెకు నివసిస్తున్నారు. నాలుగు నెలలుగా అద్దె చెల్లించక పోవడంతో యజమాని తంగుడు ఉపేంద్ర ఇల్లు ఖాళీ చేయాలని హెచ్చరించాడు. దీనిని మనసులో పెట్టుకుని అతని కుమారుడు జామి రమేష్, సరుబుజ్జిలికి చెందిన చంటి అనే వ్యక్తిని సంప్ర దించాడు. అతడు ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు కలిపి ఐదుగురిని ఆ ఇంట్లో ఉండేం దుకు ఏర్పాట్లు చేశాడు. శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో సరుబుజ్జిలి మూలసవలాపురానికి చెందిన ఐదుగురు వ్యక్తులకు తాళాలిచ్చి పంపాడు. వారు ఇంటిలోకి వెళ్లడంతో సీసీ కెమెరాల్లో చూసిన ఇంటి యజమాని ఉపేంద్ర వారిని ప్రశ్నించగా వారు దురుసుగా వ్యవహరించారు. వెంటనే ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్ఐ కె.రాము సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వచ్చి తలుపులు కొట్టినా వారు తీయలేదు. మరుసటి రోజు శనివారం ఉదయం పోలీసులు, కాలనీ వాసులు కలిసి ఒత్తిడి చేయగా ఏఎస్ఐ నారాయణ చాకచక్యంగా వారితో మాట్లాడడంతో కొంతసేపటికి తలుపులు తెరిచారు. వెంటనే కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో కాలనీలో ఉద్రిక్తత నెలకొంది. సదరు వ్యక్తుల నుంచి తనకు ప్రాణహాని ఉందని ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపారు.


ఇంట్లో చొరబడిన వారిని బయటకు తీసుకువస్తున్న పోలీసులు

కార్మికులకు వ్యతిరేకంగా ప్రభుత్వాల నిర్ణయాలు

సోంపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుంటున్నాయని, వీటిపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సీఐటీయూ రాష్ట్రప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. సోంపేటలో సీఐటీయూ జిల్లా మహాసభలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోషలిజం ద్వారానే అందరికీ ఉపాధి, హక్కులు, సమానత్వం వస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 8 గంటల పనిదినాన్ని 13 గంటలకు పెంచుతూ చేసిన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలైన విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే, ఎస్ఐసీలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇటీవల అమరులైన ఉద్యమ నేతలు సీతారాం ఏచూరి, వీజేకే మూర్తి, కొల్లి సత్యనారాయణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్ర మంలో సంఘం రాష్ట్రకార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీఐటీ యూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మునాయుడు, ఎస్.లక్ష్మీనారాయణ, పి.తేజేశ్వర రావు, కె.నాగమణి, అల్లు మహాలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలు

ఇచ్ఛాపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో గత నెల 26 నుంచి 28వ తేదీ వరకు జరిగిన ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో ఈదుపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-14 విభాగంలో బోర కార్తీక్ (ట్రయాథ్లన్-సీ) బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అండర్-18 విభాగంలో బోర బేబీ (మిడ్ లేరిలో) కాంస్య పతకం సాధించింది. కార్తీక్ ఈనెల 9 నుంచి 14 తేదీ వరకు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ కళింగ స్టేడియంలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాడని హెచ్‌ఎం బి.తమ్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభకనబరిచిన విద్యార్థులను, పీఈటీ సాజన్‌ను హెచ్‌ఎంతో పాటు ఎస్‌ఎంసీ చైర్మన్ ఎస్.నరసింహ మూర్తి తదితరులు అభినందించారు.

భారత రాజ్యాంగ విలువలను పరిరక్షించండి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ డీజీపీ పూర్ణచంద్రరావు తదితరులు

శ్రీకాకుళం లీగల్ అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ విలువలను పరిరక్షించిన నాడే బహుజనులకు న్యాయం జరుగుతుందని రిటైర్డ్ డీజీపీ, ఆల్‌ఇండియాబహుజన పార్టీ నేషనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ జె.పూర్ణ చంద్రరావు అన్నారు. స్థానికంగా ఓ హోటల్‌లో శనివారం పార్టీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. బహుజనులకు రాజ్యాధికారం వచ్చిన నాడే అట్టడుగు వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ఈనెల 9న భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుతూ విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లకె రాజారావు, డాక్టర్ పీబీ కామేశ్వరరావు, జిల్లా దళిత సంఘ నాయకులు కంఠ వేణు, క్లోపల్లి రాంగోపాల్ పాల్గొన్నారు.

రెండు దుకాణాల్లో చోరీ

కంచిలి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మఖరాంపురం పరిధిలో రెండు దుకాణాల్లో శుక్రవారం రాత్రి దొంగతనానికి పాల్పడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మీనాక్షి జెరాక్స్ బుక్‌స్టోర్స్‌లో ఉంచిన సుమారు రూ.3 వేలు నగదు, పక్కనే ఉన్న భూలోకమాత ఎలక్ట్రికల్ దుకాణంలో రూ.10 వేలు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు హెచ్‌సీ రూప్‌కుమార్ ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు.

న్యూస్ బాక్స్

కేశవరావుకు ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల విద్యుదాఘాతానికి గురై తీవ్రగాయాలపాలైన గిన్ని కేశవరావుకు ఎలక్ట్రీషియన్ యూనియన్ సభ్యులు శనివారం పరామర్శించారు. ఈమేరకు రూ.22 వేలు సాయాన్ని అందించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రంగాల శ్రీను, కృష్ణారావు, కాయ శ్రీను, ధర్మ సాహు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

అరసవల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సోంపేట మండలంలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న శశికళ భర్త రమణ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.10 లక్షల చెక్కును కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అందజేశారు. శ్రీకాకుళంలో శనివారం కేంద్రమంత్రి కార్యాలయంలో బాధితులకు చెక్కు అందించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు తంగి మురళీమోహనరావు, పప్పల రాజశేఖర్, బత్తుల రవి కుమార్, భైరి అప్పారావు, వి.హరిశ్చంద్రుడు, వై.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ చాంపియన్‌షిప్‌కు అంపైర్‌గా సూరిబాబు



శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎంతో ప్రతి ష్టాత్మకంగా నిర్వహిస్తున్న జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీలకు అంపై ర్‌గా సంపతిరావు సూరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) జనరల్ సెక్రటరీ సంజయ్ మిశ్రా నుంచి ఉత్తర్వులు అందాయి. అసోం రాష్ట్రం గౌహతిలో ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు ఈ పోటీలు జరగను న్నాయి. సుమారు 97 దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొనే ఈ పోటీలకు చిలకపాలెం జడ్పీ హెచ్‌ఎస్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సూరిబాబు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు రాజేంద్రన్, ఎం.అశోక్ కుమార్, డా.గూడేన సోమేశ్వరరావు, అనిల్ కుమార్, గురుగుబెల్లి ప్రసాద్, రత్నాజీ, దామోదర్, జిల్లా పీఈటీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తవిటయ్య, ఎంవీరమణ, హెచ్‌ఎం చౌదరి లీలావతి కుమారి తదితరులు అభినందించారు.

పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలి

ఇచ్ఛాపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పార్టీ నిర్ణయాలకు ప్రతి ఒకరూ కట్టుబడి ఉండాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు అన్నారు. శనివారం కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడిన ప్రతీ ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. ఏ సమస్యలున్నా విన్నవించుకోవచ్చని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తారని పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్ హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఏఎం సీ డైరెక్టర్ దుంగ భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు బాసి బారతిరెడ్డి, రాజశేఖర్, పాపారావు, జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యుడు దూగాన దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

పొందూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన రాపాక-కింతలి మార్గంలోని రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను శనివారం ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. పిచ్చి మొక్కలతో మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రయాణికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్ అండ్‌బీ జేఈ పీటీ రాజు ఆధ్వర్యంలో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను తొలగించారు.

అర్ధరాత్రి హైవేపై ప్రమాదం

- లారీ కేబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్
- సురక్షితంగా బయటకు తీసిన అంబులెన్స్ సిబ్బంది



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ ముందు భాగం



డ్రైవర్‌ను రక్షిస్తున్న దృశ్యం

నరసన్నపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): దేవాది గ్రామం జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. నేషన్ హైవే సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా నుంచి విశాఖ వైపు వెళ్తున్న భారీ ట్రక్కు (లారీ)ను టీ తాగేందుకు హైవే పక్కనే డ్రైవర్ నిలుపుదల చేశారు. అదే కంపెనీకి చెందిన మరో భారీ ట్రక్కు వెనుక నుంచి వస్తూ ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఢీకొన్న ట్రక్కు డ్రైవర్ బబుల్ సింగ్ స్టీరింగ్ మధ్య కేబిన్‌లో ఇరుక్కొని ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుండగా.. ముందు ట్రక్కు డ్రైవర్ నేషనల్ హైవే సిబ్బందికి సమాచారం అందించాడు. వెంటనే హైవే సిబ్బంది అక్కడికి చేరుకొని స్టీరింగ్ మధ్యలో ఇరుక్కున్న డ్రైవర్‌ను మరికొంతమంది లారీ డ్రైవర్ల సాయంతో బయటకు తీశారు. అతడిని వెంటనే చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. హైవే అంబులెన్స్ సిబ్బంది సకాలంలో చేరడంతో డ్రైవర్‌ను ప్రాణాలతో కాపాడడం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

దసరా సెలవులకు వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నవీన్ (ఫైల్)

ఎచ్చెర్ల, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల కోసం వచ్చిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన ఘటన పొన్నాడ బ్రిడ్జి రోడ్డులో శుక్రవారం అర్ధరాత్రి సంభవించింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఆమదాలవలస మండలం కలివరం పంచాయతీ ముద్దాడపేటకి చెందిన నవీన్(19) గతే డాది పాలిటెక్నిక్ పూర్తిచేశాడు. ప్రస్తుతం విశాఖపట్నంలో నవీన్ పార్ట్‌టైమ్ జాబ్ చేసుకుంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. దసరా సెలవుల కోసం విశాఖ నుంచి ఇంటికి వచ్చిన నవీన్ తన స్నేహితుడి బైక్ తీసుకుని ఎచ్చెర్ల మండలం పొన్నాడ వైపు వచ్చాడు. రాత్రి 12 గంటల సమయంలో పొన్నాడ నుంచి శ్రీకాకుళం వైపు అతివేగంగా వస్తుండగా బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. నవీన్ తండ్రి సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. సత్యంకు ఉన్న ఇద్దరు పిల్లలు కాగా కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరిలో కుమారుడు మృతి చెందడంతో వారు లబోదిబోమంటున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



దామోదరరావు (ఫైల్)

నరసన్నపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్నానం చేసుకునేందుకు చెరువుకి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన ఘటన శనివారం కామేశ్వరిపేట గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. శనివారం ఉదయం స్నానం కోసం కనుగుల దామోదరరావు (37) గ్రామ సమీపంలో గల చెరువుకి వెళ్లాడు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు జారీపడి లోతైన ప్రాంతంలోకి వెళ్లిపోయాడు. అతడికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. స్థానికులు గుర్తించి వెంటనే అతడిని బయటకు తీసి సపర్యలు చేసినా ఫలితం లేకపోయింది. దామోదరరావు తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు..

రణస్థలం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కోష్ఠ గ్రామం వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని శ్రీ కాకుళం పట్టణానికి చెందిన డి.ప్రసాదరావు (68) మృతి చెందారు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రసాదరావు కుమారుడు శ్రీనివాసరావు కోష్ఠలో పాన్‌షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. కుమారుడి ఇంటికి ప్రసాదరావు శనివారం వచ్చాడు. ఈక్రమంలో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన వివరాలు సోషల్ మీడి యాలో రావడంతో కుటుంబ సభ్యులు గుర్తించి జేఆర్ పురం ఎస్ఐ చిరంజీవిని కలిసి ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

జవాన్‌పై హిజ్రాల దాడి

నరసన్నపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎఫ్ జవాన్‌పై హిజ్రాలు దాడి చేసిన ఘటన మండలంలో శుక్రవారం చేటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం పోలీసులు తెలిపారు. నడగాం గ్రామానికి చెందిన దుంపక ఆనంద్ బీఎస్ఎఫ్‌లో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. దసరాకు సెలవుపై స్వగ్రామానికి వచ్చిన ఆనంద్ శుక్రవారం మధ్యాహ్నం ఉర్లాం వైపు వెళ్తుండగా మార్గ మధ్యలో కొంతమంది హిజ్రాలు అడ్డగించి డబ్బులు డిమాండ్ చేశారు. తన దగ్గర లేవని ఆనంద్ చెప్పినా వినిపించుకోకుండా దాడి చేసి, అతడి మెడలో ఉన్న తులం బంగారం చైన్‌ను లాక్కున్నారు. ఈ ఘటనపై శనివారం ఉదయం ఆనంద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష అందజేత



చెక్కు అందిస్తున్న సోమేశ్వరరావు

సంతబొమ్మాళి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1982లో పదో తరగతి వరకు చదువుకున్న అప్పిని సోమేశ్వరరావు రూ.లక్ష ఆ పాఠశాల అభివృద్ధికి శనివారం అందజేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పనిచేసిన సోమేశ్వరరావు ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తనవంతుగా సాయం అందించినట్టు ఆయన తెలిపారు. హెచ్ఎం సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారుల గండ్లు పూడ్చివేత

నందిగాం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మండలంలో కురిసిన వర్షాలతో దెబ్బతిన్న రోడ్లను పూడ్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. పెంటూరు నుంచి శివరాంపురం మీదుగా బడబంద జంక్షన్ రహదారికి గండిపడడంతో జేసీబీ ద్వారా పూడ్చారు. అలాగే నందిగాం నుంచి పోలవరం వెళ్లే రహదారి కోతకు గురవడంతో దాన్ని కూడా మరమ్మతులు చేపట్టారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

వజ్రపుకొత్తూర, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఫ్యాప్టో ప్రతినిధులు డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు శనివారం నగరంపల్లి హైస్కూల్ నుంచి వజ్రపుకొత్తూరు బస్టాండ్ వరకు ఉపాధ్యాయులంతా ర్యాలీ చేపట్టి మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు.

ఆటోడ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం



నరసన్నపేట: సత్యవరం జంక్షన్ వద్ద కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం స్థానిక సత్యవరం జంక్షన్ వద్ద ఆటోడ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సత్యవరం జంక్షన్ నుంచి ఆర్అండ్‌బీ అతిథి గృహం వరకు ఆటో నడిపి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు, ట్యాక్సీ, క్యాబ్‌లు నడిపే వారికి వాహనాలపై గ్రీన్ ట్యాక్స్ తగించడంతో పాటు ఏడాదికి రూ.15వేల ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. నియోజవర్గంలో 1,578 మందికి ఈ పథకంలో ఆర్థిక చేయూతనిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొందరి, కూరాకుల కార్పొరేషన్ చైర్మన్ దామోదర నర్సింహులు, కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పోగోటి ఉమామహేశ్వరి, సారవకోట ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనతో పేదరిక నిర్మూలన..



ఆమదాలవలస: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి కల్పనతోనే పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. శనివారం ఆమదాలవలసలో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొందరు ఆటో డ్రైవర్లను శాలువలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 1813 మంది ఆటో డ్రైవర్లకు ఈ పథకం ద్వారా లబ్ధి కలుగుతోందని తెలిపారు. నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు సీఎం చంద్రబాబునాయుడును ఒప్పిస్తే కొంతమంది వైసీపీ నాయకులు విష ప్రచారం చేస్తున్నారని రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినని గీతా విద్యాసాగర్, టీడీపీ నాయకులు మొదలవలస రమేష్, ఆనెపు రామకృష్ణ, బోర గోవిందరావు, డాక్టర చాపర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట..



పలాస: ఆటో డ్రైవర్లకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస/కాశీబుగ్గ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శనివారం మధ్యాహ్నం స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ రానున్న మూడున్నరేళ్ల కాలంలో ప్రజలు ఎన్నడూ లేని అభివృద్ధి ఫలితాలు అందుకోబోతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులకు చెక్కును అందించారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వర రావుయాదవ్, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాస్, పీసీఎంఏ ప్రధాన కార్యదర్శి టంకాల రవిశంకర్‌గుప్తా, ఆటో కార్మిక సంఘ గౌరవ అధ్యక్షుడు దువ్వాడ శ్రీకాంత్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరినీ ఆదుకోవడమే ధ్యేయం..



రణస్థలం: ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఆటో డ్రైవర్లు.. ఫొటోలో విజయనగరం ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో, ట్యాక్సీ మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్ల సంక్షేమం దిశగా ప్రభుత్వం పెద్ద అడుగు వేసిందని తెలిపారు. అనంతరం జడ్పీ హైస్కూల్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, ముప్పిడి సురేష్, లంక శ్యామలరావు, కొమరాపు రవి, బెండు మల్లేశ్వరరావు, పిసిని జగన్నాథంనాయుడు, రౌతు శ్రీనివాసరావు, వడ్డాది శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నం: ఆటో డ్రైవర్లకు చెక్కు అందిస్తున్న కూటమి నేతలు

ఆటోడ్రైవర్లకు దసరా నజరానా..

పాతపట్నం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం దసరా నజరానా అందించిందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని వర్చువల్ పద్ధతిలో ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో మొత్తం 1462 మంది ఆటోడ్రైవర్లకు ఆర్థిక సాయం అందిందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే తనయుడు మామిడి సాయిగణేష్ ఆధ్వర్యంలో ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు బండి రవివర్మ, కూటమి నేతలు పైల బాబ్జీ, సలాన మోహనరావు, తూలుగు తిరుపతిరావు, హిరమండలం ఏఎంసీ చైర్మన్ మామిడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి దాసరి రాజు, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పత్రి తివిటయ్య, ఎన్.కోటి, మాజీ ఎంపీపీ డిల్లీరావు, కాళ్ల ధర్మారావు, కొండా శంకర్‌రెడ్డి, కౌన్సిలర్ కాళ్ల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఆనందమే లక్ష్యం..



ఇచ్ఛాపురం: ఆటో డ్రైవర్లకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లలో ఆనందం నింపడమే ప్రభుత్వ లక్ష్యమని విప్, ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. నియోజకవర్గంలో గల 1083 మంది ఆటోవాలాల బ్యాంక్ ఖాతాల్లో రూ.15వేలు చొప్పున జమ చేసినట్టు తెలిపారు. లొద్దపుట్టి ధనరాజ తులసమ్మతల్లి అమ్మవారి గుడి వద్ద శనివారం ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. 100 ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట వెంటనే అమలు చేసి ఆటో వాలాలకు అండగా నిలిచారని అన్నారు. ఈమేరకు ఆటో డ్రైవర్లకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన

ఆటో డ్రైవర్లకు ఆర్థిక ఊతం..

టెక్కలి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లకు కూటమి ప్రభుత్వం ఆర్థిక ంగా ఊతం అందించేందుకు ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించారని ఎమ్మెల్సీ డాక్టర్ వేపాడ చిరంజీవి అన్నారు. శనివారం తెంబూరు రోడ్డు జంక్షన్‌లో ఆటో ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్లు థ్యాంక్యూ బాబూ అంటూ నినాదాలు చేశారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, కింజరాపు హరిప్రసాద్, ఎల్ఎల్ నాయుడు, బగాది శేషగిరి, ఎంపీఐ సంజీవరావు, పినకాన అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవి

రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

హిరమండలం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంశధార నదిలో నీటి ప్రవాహం పెరిగి వరదలు సంభవించడం వల్ల జిల్లాలోని రైతులకు తీవ్ర నష్టం కలిగిందని, నష్టపోయిన ప్రతి రైతుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శనివారం వంశధార వరద తాకిడికి పాత తుంగతంపర గ్రామం సమీపంలో వంశధార నదికి ఎడమ వైపు ఉన్న వరదగట్టు కోతకు గురైన ప్రాంతాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. పంట నష్టంపై నివేదికలు ఇవ్వాలని వ్యవసాయాధికారులను సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోతకు గురైన ప్రాంతాన్ని 24గంటల్లో పూడ్చివేసేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొంతమేర వరద కట్టల నిర్మించడం జరిగింది ని, వైసీపీ అధికారంలోకి వచ్చిన వాటి గురించి పట్టించుకోలేదన్నారు. కొత్తూరు మండలం నుంచి కళింగపట్నం వరకు వరదకట్టల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తూరు, హిరమండలం మండలాల్లో కరకట్టల నిర్మాణం తక్షణమే ప్రారంభిస్తామని, ఇందుకు అనుమతులు కూడా వచ్చాయన్నారు. జిల్లేడుపేట గ్రామం వద్ద మహేంద్రతనయ నదిపై వంతెన నిర్మించాలని ఆ గ్రామస్థులు కేంద్రమంత్రిని కోరారు. కార్యక్రమంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, మామిడి సాయిగణేష్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల సేవలో..

(ఐదో పేజీ తరువాయి)

ఇబ్బందులను గుర్తించాం. మిమ్మల్ని ఆదుకునేలా ఈ పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.15వేలు అందజేశాం. ఇది మొదలు మాత్రమే. ముున్ముందు మరిన్ని మంచి పనులు చేయనున్నామ'ని తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకం ద్వారా లబ్ధి పొందిన నగదును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. 'శ్రీకాకుళం నియోజకవర్గంలో 2011 మందికి ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందుతుంది. సొంత ఆటోలు, క్యాబ్‌లు కలిగి, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ పత్రాలున్న అర్హులందరికీ ఈ పథకం వర్తింపజేశామ'ని తెలిపారు.
- కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, ఆర్డీవో సాయిప్రత్యూష, కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, ఉప రవాణా అధికారి ఎ.విజయసారధి, ఆర్టీవో పివి.గంగాధర్, పీఎంజే బాబు, కలగ జగదీష్, అరవల రవీంద్ర, శవ్వాన ఉమామహేశ్వరి, పాండ్రంకి శంకర్, మాదారపు వెంకటేష్, ఆటోడ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు

పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం

పలాస, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి ప్రజలకు జీఎస్టీ తగ్గింపు ఎంతో ప్రయోజనమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, మెప్మా సిబ్బంది, వ్యాపారులకు కొత్త జీఎస్టీ అమలుపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. 375 రకాల వస్తువలపై జీఎస్టీ తగ్గుతుందన్నారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ నాగరాజు, మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పీసీఎంఏ ప్రధాన కార్యదర్శి టంకాల రవిశంకర్ గుప్తా, టీడీపీ నేత పీరుకట్ల విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముర్రాటలతో అమ్మవారికి చల్లదనం



ముర్రాటలతో వెళ్తున్న భక్తులు

కోటబొమ్మాళి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): చలమయ్యపేట గ్రామానికి చెందిన భవాని స్వాములు, గ్రామస్థులు శనివారం బిందెలతో అమ్మవారికి ముర్రాటలతో చల్లదనం చేశారు. వీరన్నస్వామి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారి గీతాలు, నృత్యాలతో సందడి చేశారు. అమ్మవారికి సమర్పించిన చీర వేలం పాట నిర్వహించగా బోయిన వెంకటరావు రూ.16,600 సొంతం చేసుకున్నారు.

పంట నష్టంపై సర్వే చేయండి

కొత్తూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వరద ముంపు గ్రామాల్లో పర్యటించి పంట నష్టంపై సర్వే చేసి నివేదికలు తయారు చేయాలని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు (జేడీఏ) త్రినాథస్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలో వసప, కుద్దిగాం, మాకవరం, పోనుటూరు గ్రామాలను సందర్శించి పంట పొలాలను పరిశీలించారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేయాలన్నారు. కొత్తూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బి.రాజగోపాలరావు, ఏవో స్వర్ణలత తదితరులు ఉన్నారు.

- జలదిగ్బంధంలో చిక్కుకున్న పెనుగోటవాడ గ్రామంలో శనివారం అధికారులు వైద్య శిబిరం నిర్వహించారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

హరిపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలంలో ఇటీవల తుఫాన్‌తో నష్టపోయిన పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే శనివారం పర్యటించారు. బాహడపల్లిలో కూలిపోయిన ఇల్లును, నల్లబొడ్లూరు, హరిపురం, తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించి బాధితులతో మాట్లాడారు. టీడీపీ నాయకులు బావన దుర్యోధన, దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, సాలిన మాధవరావు, జానకిరావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులను ప్రతిఘటిద్దాం

పలాసరూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ శక్తులను ప్రతిఘటిద్దామని సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు పిలుపునిచ్చారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో శనివారం డిసెంబరు 6,7 తేదీల్లో కడపలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, సభ్యులు ఎం.రామారావు, పాల్గొన్నారు.

జగదీశ్వరస్వామి ఆలయంలో నాగుపాము



టెక్కలి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జగతిమెట్ట దరి జగదీశ్వరస్వామి ఆలయం తలుపులు శనివారం అర్చకులు తెరువగా శివలింగం పక్కన నాగపాము ప్రత్యక్షం అయింది. అయితే తరచూ నాగుపాము ఇలా కనిపిస్తుంటుందని అర్చకులు తెలిపారు. ఇది ఎంతో సంతోషకరంగా ఉందన్నారు.

సమస్యలపై దృష్టిసారించాలి

పోలాకి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పలువురు సభ్యులు అధికారులను కోరారు. శనివారం ఎంపీపీ ముద్దాడ దమయంతి బైరాగినాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పోలాకి సర్పంచ్ మజ్జి రమణమ్మ, గాతలవలస ఎంపీటీసీ యాగాటి లక్ష్మణరావు సభ్యులు అసిరితాత, కోట అప్పారావు తదితరులు సమస్యలపై మాట్లాడారు. తహసీల్దార్, ఎంపీడీవో తదితరుల పాల్గొన్నారు.

పశువ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

మెళియాపుట్టి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పశువ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని పశు సమసర్ధక శాఖ ఏడీ మంచు కరుణకరరావు తెలిపారు. శనివారం కొస మాలలో జరుగుతున్న టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆర్థికంగా ఎంతో నష్టాన్ని కలిగిస్తున్నా గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏడాదికి రెండు సార్లు టీకాలు వేయడం జరుగుతుందని రైతులు వినియోగించుకోవాలని కోరారు. మండలంలో 12 వేలు ప్రశువులకు టీకాలు వేయాల్సి ఉండగా ఇప్పటివరకు 8,598 పశువులకు టీకాలు వేశారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సోమేశ్వరావు, చలపతి, మీనాక్షి, రమేష్ తదితరులు ఉన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

ఆమదాలవలస, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సొట్టవానిపేట గ్రామ పరిధిలో పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సనపల బాలరాజు తెలిపారు. శనివారం సాయంత్రం ఆ ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్టు తమకు వచ్చిన సమా చారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. పేకాట ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నా మన్నారు. వారి నుంచి రూ.9,050 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చెత్తను తొలగించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జలుమూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట కూడలి సమీపంలోని గుంజుమెట్ట వద్ద శ్రీముఖలింగం వెళ్లే రోడ్డు పక్కన గల చెత్తను ఎట్టకేలకు అధికారులు శనివారం జేసీబీతో తొలగించారు. ఇక్కడి పరిస్థితిపై ఆంధ్రజ్యోతిలో పలుమార్లు ప్రచురితమైన కథనాలపై అధికారులు స్పందించారు. ఇక్కడి చెత్తను తొలగించి ట్రాక్టరుతో మెట్ట వెనక్కి పారబోశారు. ఇకపై ఇక్కడ చెత్త వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై చల్లవానిపేట సెంటర్‌లోని వ్యాపారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.